# నాట్యకళ

## తులాభారము

దేవులపల్లి అప్పల నరసింహముగారు

(శ్రీ మెహెర్ బాబా నాటక కంపెనీవారిచే కుంభకోణమందు గావింపబడిన ప్రదర్శనము.)

"నాటకము దేవతలకు మనోహరమగు నేత్ర యజ్ఞమని బుధులు గణింతురు". ఇది కాళిదాసోక్తి. ముఖ్యముగా భక్తి శృంగారరసములతో నిండియుండు నాటకములకు దేవతలను సంతోషింపజేయు శక్తి గలదు. పురాణప్రసిద్ధులును దేవాంశసంభూతులును అగు స్త్రీ పురుషుల పాత్రలను ఆశ్రయించుకొని భక్తిమాహాత్మ్యము ముఖ్యాదర్శముగా గలిగి శృంగారరసమును సాధనముగా గైకొని యిమిడిన యీ తులాభారకథాంశము దేవ మానవులను సంతోషింపజేసి మానవులను ఉత్తమమార్గమున నడిపింపజాలును.

ఇట్టినాటకమును ప్రదర్శించుటలో ముఖ్యకృషి చేసిన కపిలవాయి రామనాథశాస్త్రిగారు ప్రధాన నటుడుగా గల మెహెర్ బాబా కంపెనీవారు 19-5-31 తేదినాటిరాత్రి ఆంధ్రభాష తెలియని సభయెదుట ఈ యూరిలో "తులాభారము" అను నాటకమును ఆంధ్రభాషలో ప్రదర్శించుటకు సాహసించి మెప్పు వడసిరి. జగద్విదిత మగు రామనాథశాస్త్రిగారి పాటలున్నూ పద్యములున్నూ, రుక్మిణీవేషధారియగు రఘురామయ్యగారి వేణువు లేకనే చేతివ్రేళ్లతోనే వేణుగానముచేయు చక్కని నేర్పున్నూ కొనియాడబడినవి. రామనాథశాస్త్రిగారి స్వరము గ్రామఫోనులోనున్నంత లక్షణముగా వినపడలేదని మాత్రము చాలామంది అనుకొనిరి. సత్యభామ రామతిలకమ్మగారు గొంతు సన్ననిదైనను స్త్రీభావప్రదర్శనమునందునూ, పాటయందునుకూడా మెప్పునొందిరి. భాష తెలియనిసభను విశదమగు నుచ్చారణచేతను, గానకౌశలముచేతను వీరలెట్లో రంజింపగలిగిరి. ఆంధ్రనటులు తమిళ సభను మెత్తము మీద రంజింపజేయగలిగినందుకు ఆంధ్రుడ నగు నేను ఈ వ్యాసము మూలముగా నటులను, కంపెనీవారిని అభినందించుచున్నాను.

కాని కళాభిమానులను ఖిన్నులను చేయు కొన్ని యంశములు ముచ్చటింపదగియున్నవి. ప్రదర్శనమందు ఇది నాటకమా, పాటకచ్చేరియా యను సందియము చూపరులకు కలుగుట నాటకమునకు మూలవిచ్ఛేదము గాదా? పాట ప్రధానమగు నాటకములను ఇంగ్లీషు వాఙ్మయమున వేరుగా "ఆపెరా" లని నామకరణము జేసియుందురు. "సంగీతనాటకము" లని మన ఆంధ్ర వాఙ్మయమునను గలవు. వీటియందు సంగీతము ప్రధానాశయము. దాని కనువగునట్లు అతితీవ్రములు లేక అతిలలితములు, అత్యద్భుతములు నగు కథపట్టులు ఆవశ్యకములు. ఇట్టి పట్టులు గల కథల నీ సంగీతనాటకములందు వస్తువులుగా గ్రహింతురు. నాటకములన్నవో మానవజీవితప్రతిబింబమునే ముఖ్యాదర్శముగా గలిగియుండును. ప్రకృతి ననుకరించు పాత్రపోషణము, సంభాషణము, కథపట్టులు ఇట్టివానికి ఆవశ్యకములైయుండును. వీటిలో సంగీత ముండవచ్చును. శృంగారాది భావములు తీవ్రములగుటచే విస్తరించి తెలుపుట అవశ్యమగు పట్టులయందు పద్యములు ఉపయోగింపబడు చోటులయందును కొంచెము సంగీతసాహాయ్యము నపేక్షింపవచ్చును. గాని నాటకములందు రాగతాళ సహితమగు సంగీతమును తరుచుగా జొనుపుట దోషము గాని గుణము గాదు. ఈ తులాభారప్రదర్శన మిట్టి దోషమును ముఖ్యముగా గనుపరచెను. ఈ దోషము నటకుల యభిరుచుల వలన అధునాతన రంగమున సంభవించుచున్నదా లేక ప్రేక్షక సభికుల యొక్క అభిరుచులవలన సంభవించుచున్నదా? తప్పెవరిదైనను దిద్దుకొనవలసినదే. కళాధిదేవతోపాసన

నిష్కళంకము గానిచో సభికులను, నటకులను, దేశమును వింతమార్పుల నొందించును. దేవతల కానందము కలిగించుటకుబదులు "ఇదియా మానవలోకము" అనునట్లు విసుగును, విచారమును కలుగజేయును.

అదియునుగాక, శ్రుతివాద్యము మొదలగునవి రంగస్థలమునందలి గానమునకు అనుకరణములు. ఇవి గానమును మంచిచేసి గానమందలి మాటలను శ్రోతల చెవులలో బడకుండ నీకాకు చేయునట్లుండరాదు. మృదంగము, సానాయి, పిడేలు ఇట్టి యనుకరణము విడనాడబడి పెద్ద సభలకు తగినట్లు హార్మోనియము అమర్చబడినది. ఇది రంగమున కొకప్రక్కను సభికులకు కనబడకుండా అమర్చబడినచో నిజముగ అనుకరణమే అయియుండి పాటకు తోడ్పడి మనోరంజకముగా నుండును. వీధినాటకములయందుగూడ తాళము, మృదంగము, సానాయి ఒకప్రక్కకు ఒదిగి నిలుచుండుట ఆచారము. మహారాష్ట్ర, పార్సీ నాటకములయందు కూడా నిట్టి యాచారమే యున్నట్లు నాకు జ్ఞాపకము. ఈ యారి కాలేజియువకులు సంస్కృతనాటకములాడినప్పు డిట్టి నాటకరంగే మాచితిని. ఎంతయు శ్రుతిరంజకముగా నుండెను. ఆంధ్ర తమిళ నాటకప్రదర్శనములందు ఈరీతి మార్చబడి హార్మోనియము నటకులకు శ్రోతలకు నడుమ నమర్చబడుట యేమికారణమో రంగగానచతురులును, రంగవిమర్శక చతురులును ఊహించి తగిన మార్పుచేయుదురు గాక!

నారదపాత్రము భక్తిపాటలకు ప్రసిద్ధమైనను కథాసందర్భమేమియు లేకయే రంగస్థలమున చరించుట, కూర్చుండుట మొదలగునవి రంగనియమములకు విరుద్ధము. ఇది నటకుల తప్పే. నారదవేషము గూడా దేవముని, నరముని, గోసాయివేషము లన్నిటికిని తప్పి యున్నది. అయినను ఒకవిధముగ ఇంపుగనే యుండెను.

ఇంకొకటి: రుక్మిణీ పాత్రధారి రంగస్థలమునకు తనచేటితో వచ్చి సభ నొకింతసేపు తిలకించి తిన్నగా హార్మోనియమునకు దగ్గరగావచ్చి కూర్చొని చేతివ్రేళ్లతో పిల్లనగ్రోవి గానమును చేసెను. కాని దీని కెట్టిసందర్భమును లేకపోయెను. చేటితో సంభాషణయును లేదు. సంభాషణమువల్ల తన మనోహరుడు దగ్గర లేనందున అతనికి ప్రియమగు వేణుగానమును అనుకరించి ప్రొద్దుబుచ్చుచున్నట్లు తెలుపుచు జేసినయెడల నీ గానమునకు చక్కని సందర్భము అమరియుండెడిది. ఇదియును నటకులలోపమే అయియుండవచ్చును. గ్రంథకర్తయిట్టి పట్టును సందర్భశూన్యమును అర్థశూన్యమును ఒనరించునని నమ్మజాలను.

నీచపాత్రములును, మధ్యమపాత్రలును ఎట్టిసందర్భమును అవసరమును లేకుండనే రంగమున అటునిటు పరుగిడుచుండుట మిక్కిలి అసహ్యముగా నుండెను. వీధినాటకములయందు గూడ నిట్టి నియమోల్లంఘనమును నేను చూచియుండలేదు. ఈనటకులకుగాని, వీరికి నటనాభ్యాసము చేయించినవారికి గాని నాట్యకళయందు సరియైన గౌరవములేదని దీనివలన తెలియుచున్నది. ఇక విదూషకుని మాటలకుగాని, కుచేష్టలకుగాని కథాంశముతో నెట్టిసంబంధము లేదు; సరికదా, చివరను ఈ విదూషకుడే చెప్పదగిన వస్త్రాదివేషములమార్పు లేమియు లేకుండ త్రాగుబోతు మంగలిగా రంగమున విజృంభించుట నాటకమున కంతకును కళంకమును తెచ్చినదని నుడువుటకు చాలా చింతిల్లుచున్నాను. ఈతడే "నేను రెండవబొబ్బిల్లి" అని సాభినయముగా నొకసారి పాడనారంభించగా సభికులు కోపమును, అసంతృప్తిని బిగ్గరగా తెలుప సాహసించిరి. నటకు లిట్లు నిర్లక్ష్యముగా బాధ్యతను గుర్తెరుగకుండా వ్యవహరించుచో రంగస్థలము కళాధిదేవతోపాసన కనువగు నాలయముగ నుండనేరదు. కళాభిరుచి నెన్నటికిని పెంపొందజేయ జాలదు.

నటుడు వేషధారియని యెల్లరకును దెలియును. కాని కొంతవరకు ఆవేషము పాత్రమునకు తగియుండవలెను. ఆదర్శనీయముగ నుండవలెను. కృష్ణవేషమునందు తప్ప తక్కిన వేషములలో పాత్రౌచిత్యము గనుపడలేదు. రుక్మిణీసత్యభామల వేషములు రాణులకు తగినట్లు ఎంతమాత్రము గనుపడలేదు. ఈ కంపెనీవారు నటాలంకరణము, రంగాలంకరణము—వీనియందు ఔచిత్యము నేమాత్రమును గమనించినట్లు తోచదు. పారుగూర

లభించుసామగ్రిని తమ అవసరమునకు తగినట్లు ఏర్పఱచు కొనవచ్చును. అట్టి ఊహ వీరికి ఉన్నట్లు వీరి ఏర్పాటుల వల్ల కనుపడలేదు. అవస్థకు తగినట్లు పాత్రములకు కొంత వరకైనను వేషము మార్పు చేయవలసి యుండును. అట్టి దేమియు జరుగలేదు. వేశ్యాపాత్రమునకును, రాణి రుక్మిణికిని దుస్తులయందు వ్యత్యాస మేమియు చేయబడలేదు. వేశ్యాపాత్రమునకు తగని నటుని ఆనటునకు నియోగించియు, ఆపాత్రమునకు నృత్యసమయమున నుండతగిన ప్రసాధనవిధిని సమకూర్పకయు సభికుల కేవగింపు కలుగ జేసిరి. మాధుర్యముగాని, సమయౌచిత్యము గాని లేనట్టి వంటి యీవేశ్యాపాత్రము యొక్క నృత్యమును, పాటలను రెండుసారులు రంగమున ప్రవేశపెట్టుటలో సభికుల మనమునుగాని, నాటకకళ యొక్క ముఖ్యాశయమును గాని, తమకంపెనీప్రతిష్ఠను గాని యీనాటక సమాజమువారు గమనించిన ట్లగుపడదు. రఘురామయ్యగారి గానకౌశలము ఇట్టి ప్రదర్శనలోపములవలన సభికులకు గలిగిన ఏవగింపును కొంతవరకు అణచుటకు కారణ మాయెను. కాని అదియును హాస్యాస్పదముగాని మణివలె తగిన శోభను పొందజాలక పోయెను.

పైని పొందుపరచిన ప్రదర్శనలోపములు గాక నాటకమునందలి యొక పెద్దలోపముగూడ నాకు కనబడినందునను, అది సాధారణముగా ఆంధ్రనాటకములందు కనుపడుచున్నందునను ఇంచుక దానిని గురించి యీ సందర్భమున ముచ్చటించుచున్నాను. వచన సంభాషణ కన్న పద్యములు ఎక్కువగా నుండెను. ప్రదర్శనము సులభమగుటకొరకు నటులు కొన్ని భాగములను వదలి యుండవచ్చును. కాని సంభాషణ తక్కువగుటచే నాటకమునకు జీవకళ తగ్గెను.

సత్యభామ తనయింటికి వచ్చెనని విన్నపుడు "ఏమిది సత్యభామ..." యను నొక ఉత్పలమాల పద్యమును ప్రయోగించుటకన్న తన సహృదయోదారభావములను వచనమున వెల్లడించుట స్వాభావికముగను ఇంపుగను నుండెడిది. సవతిని దెప్పుటయందు ఆమెకు ఇష్టము లేనటుల సందర్భమువల్లను, నడవడికవల్లను తత్సమయమున చేష్టలవల్లను తెలుపబడెను. అట్టి ఉద్దేశమున్నచో పద్య మపకరించును. నిండు దయాస్వభావముతోను ఆతురతతోను ఆదరించునపుడు పద్యము భావమునకు అడ్డుతగులును. మాటికిమాటికి పద్యములల్లుట కవిత్వగౌరవమును తగ్గించును. నాటకములో భావములు అతిశయలాలిత్యమునుగాని, తీవ్రతనుగాని పొందునపుడు పద్యములు ఉచితముగానుండును. నాటక సంభాషణకు వచనము తగిన ఔన్నత్యమును ఇవ్వజాలదని తలంపబడునచో వచనపద్యశకలములు ద్వపదలను వాడతగును. ఉత్పల చంపక శార్దూలాది వృత్తములు భావములు విజృంభించు పట్టుల యందుమాత్రమే రసవంతములుగ నుండునని నా యభిప్రాయము. సంస్కృతనాటకములయందు ఈ విధానము గననగును. షేక్స్పియర్ నాటకములయందు ఉత్తమ పాత్రసంభాషణల కుపయోగింపబడిన బ్లాంక్ వెర్స్ (Blank verse) ఉన్నత వచన సరళినే గలిగియుండును. దీనిలో క్లిష్టకవిత్వ పద్యసరళి భావముల కలవరమున్నచోటులయందుమాత్రము గనుపడును. ఇప్పటి యింగ్లీషునాటకములలో పద్యప్రయోగము మృగ్యము. ఈ తులాభారనాటకకర్తయే సత్యాకృష్ణులు ఉద్యానవనవిహారము జేయు సీనులో అలంకారసంభృత మగు గద్యనే ఉపయోగించియున్నారు. అందులో కొన్ని పద్యములుండిన బాగుండెడిది. నటులు వదలిపెట్టిరేమో నాకు తెలియదు. ఈనాటకమును నేను చదివియుండలేదు.

ప్రదర్శనము చూచుచున్నంతసేపు నాకు గోచరించిన లోపములను, నాటకమునకును గానమునకును ఉండతగిన సంబంధనియమములను గురించి యీవ్యాసమున వ్రాసితిని. సాహిత్యప్రియుడ నగుటచేతను, ఆంధ్ర నాటకకళాభివృద్ధిని కోరుచున్నవాడ నగుటచేతను నేను ఈ వ్యాసమున వ్రాసిన అభిప్రాయములను సాహిత్యవిచక్షణులును, నాటకకళాకోవిదులును, రామనాథశాస్త్రి గారివంటి ప్రసిద్ధ నటవరులును ఆదరముతో గ్రహించి విమర్శించి, ఆంధ్రనాటకరంగమును దేవమానవమనోహరముగా నుండునట్లు జేయుదురుగాక యని కోరుచున్నాను.